www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 17 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 8

# ఒకరి మరణ వార్త విని మరొకరు..

-భార్యాభర్తల మృతి
-తల్లిదండ్రులు మరణించడంతో అనాథలైన పిల్లలు





ప్రజాపక్షం/ కొణిజర్ల : ఒకరి మరణ వార్త విని మరొకరు ఆత్మహత్యకు పాల్పడడంతో ఇద్దరు పిల్లలు అనాథలైన విషాద ఘటన కొణిజర్ల మండలం అమ్మపాలెంలో చోటు చేసుకుంది.

మిగతా 2లో..

# విలీనం చారిత్రిక ఘట్టం..
# పోరాటాల కొనసాగింపే కర్తవ్యం..!





ప్రజాపక్షం/ ఖమ్మం : భారతదేశంలో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ నేతృత్వంలోని నిజాం రాజ్యం భారతదేశంలో విలీనం ఒక చారిత్రిక ఘట్టం. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లేకపోతే తెలంగాణ ప్రాంతం భారతదేశపు నడిబొడ్డున మరో కశ్మీర్‌లా రగులుతూనే ఉండేది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వతంత్ర రాజు నిజాం ప్రకటించుకున్నప్పుడు ఆంధ్ర మహాసభ, ఏఐటియుసి, భారత కమ్యూనిస్టు పార్టీల పక్షాన రావి నారాయణరెడ్డి, మగ్దూం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి నేతృత్వంలో సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చారు. ఈ సాయుధ పోరాటం తెలంగాణ ప్రజల జీవన గతిని మార్చింది. వేల ఎకరాల భూములు పేదల పరమయ్యాయి. బానిసలుగా బతికిన ప్రజలు ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. సామాన్యులు సాయుధులై పోరాడిన తెలంగాణ రైతాంగ పోరాటం ప్రపంచ చరిత్రలోనే సువర్ణక్షరాలతో లిఖించదగిన ఘట్టం. ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారు. తెలంగాణ ప్రాంతంలోని ప్రతి పల్లెకు ఓ చరిత్ర ఉందంటే అది తెలంగాణ సాయుధ పోరాటంతోనే

మిగతా 2లో..

# పోరాట యోధుడు గడల సీతారామయ్య



-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

ప్రజాపక్షం/కొణిజర్ల : తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న గడల సీతారామయ్య పోరాట యోధుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా గడల సీతారామయ్య స్తూపం వద్ద సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఐదేండ్ల పాటు సాయుధ పోరాటం సాగిందన్నారు. నిజాం నవాబు ఆధ్వర్యంలో గ్రామాల్లో మహిళల మీద, ప్రజల మీద చేసిన అకృత్యాలకు వ్యతిరేకంగా అణగారిన వర్గాలను చైతన్యపరిచి తెలంగాణ సాయుధ పోరాట యోధులు వీరోచితంగా పోరాడారన్నారు. నాలుగువేల మంది అమరులయ్యారని మూడువేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలను ఏర్పాటు చేశారన్నారు. పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టారన్నారు. దున్నే వానిదే భూమి అన్న నినాదాన్ని నిజం చేసింది కమ్యూనిస్టులేనన్నారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి తెలంగాణ సాయుధ పోరాటమే కారణమన్నారు. ఇప్పుడున్న కేంద్ర పాలకులు సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లిం ఘర్షణగా వక్రీకరించడం చరిత్రను మార్చడం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని

మిగతా 2లో..

# కదులుతున్న సదరం అక్రమ డొంక..!







-లక్షలు కాదు.. కోట్లలోనే వసూళ్లు
-అక్రమ ధృవీకరణ ద్వారా కోట్ల ప్రజాధనం పక్కదారి
-ఆమెకు ఎలా అవకాశం ఇచ్చారు

ప్రజాపక్షం/ ఖమ్మం : సదరం క్యాంపుల కుంభకోణాలకు సంబంధించి తీగ లాగితే డొంక కదిలినట్లుగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. 2020 సంవత్సరం నుం చి ఖమ్మం పెద్దాసుపత్రి కేంద్రంగా జరిగిన ఈ దందాలో అప్పటి సదరం బాధ్యులతో పాటు అనేక మందికి భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఒక మహిళ దగ్గర నుంచి వివిధ ధృవీకరణల కోసం రూ. 2.50 లక్షలు వసూలు చేసిందంటే ఆమె వసూళ్లు లక్షల్లో కాదు కోట్లల్లో నేనన్న చర్చ సాగుతుంది. ఒక వ్యక్తి దగ్గర నుంచే సుమారు లక్ష రూపాయలు ఆన్‌లైన్ పేమెంట్ చేయించుకున్నారంటే అసలు మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరిపితే నిర్ఘాంతపోయే అనేక

మిగతా 2లో..

# విలీనం చారిత్రిక ఘట్టం..
# పోరాటాల కొనసాగింపే కర్తవ్యం..!

**(మొదటిపేజీ తరువాయి)** సాధ్యమైంది. 78వ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగిం పు వేళ గత చరిత్రను మననం చేసుకుంటూనే మరో చారిత్రిక ఉద్యమానికి అడుగులు వేయాల్సిన సమయమిది. తెలంగాణ ప్రాంతంలో కానీ దేశంలో కానీ నిజాం పాలన నాటి పరిస్థితులు లేకపోవచ్చు. ప్రజలపై ఆ స్థాయి జూలుం జరుగుతుండకపోవచ్చు కానీ సాయుధ పోరాటానికి ముందు తెలంగాణలో భూములు కొందరి చేతుల్లో ఉండేవి. వేల లక్షల ఎకరాలు కొన్ని కుటుంబాల ఆధీనంలో ఉండటం వల్లే ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. ఇప్పుడు తెలంగాణలో భూ కమతాలు పెరుగుతున్నాయి. కార్పొరేట్లు, బడా రాజకీయ వేత్తలు, వ్యాపారులు, భూముల కొనుగోళ్లపై దృష్టిసారించారు. ఇప్పుడు తెలంగాణ నలు దిశల ఏ గ్రామంలో చూసినా వందల ఎకరాల భూములు కొనుగోలు చేయబడి సంపన్నుల చేతుల్లో బంధీ అయ్యాయి. నిన్న మొన్నటి వరకు అందులో సాగు చేసుకున్న రైతులు ఇప్పుడు అక్కడే గుమస్తాలుగా, పాలేర్లుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించింది. భూ కమతాలు పెరగడం చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. అదే సమయంలో ఈరోజు దేశ వ్యాప్తంగా ప్రశ్నించే గొంతుకలను నొక్కేసే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించినా, ప్రశ్నించినా దిమాకి నక్సల్స్ పేరుతో దండించే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే కొందరు జైళ్లలో మగ్గుతున్నారు. వారిని ఎందుకు జైళ్లలో పెట్టారో ఏళ్లు గడిచినా చెప్పే పరిస్థితి లేదు. విచారణ లేదు. ఈ పరిస్థితి భవిష్యత్తులో ప్రశ్నించే ప్రతి రాజకీయ నాయకునికి ఎదురు కావచ్చు. 78 ఏళ్ల క్రితం తెలంగాణలో ఇదే నిర్బంధం ఉంది. దొర వైపు కన్నెత్తి చూసిన వారిని గడియాలకు పిలిచి దండించారు. దండన తీరు మారిందేమో కానీ దేశంలో ఇప్పుడు అదే రకమైన నిర్బంధం క్రమేపి పెరుగుతుంది. తెలంగాణలో సంపద గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దొరలు, జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాముల చేతుల్లో ఉండేది. వెట్టి చేయడానికో, వారి పాలేర్లుగా పనిచేయడానికో మాత్రమే జనం ఉండేవారు. తెల్లటి వస్త్రం పేద వారు ధరిస్తే భరించలేని పరిస్థితి ఆనాడు ఉండేది. మళ్లీ ఇప్పుడు దేశంలో సంపద పోగుపడుతుంది. అది ఏ స్థాయిలో జరుగుతుందంటే దేశంలో జనాభా 150 కోట్లకు చేరువ అయినా ఈ తరుణంలో దేశంలో 90 శాతం సంపద 100 కుటుంబాల చేతుల్లో ఉందని ఆర్థికవేత్తలే చెబుతున్నారు. ఈ సంపద పోగుపడటం అత్యంత ప్రమాదకరమైంది. ఇక రెండవ పక్క మతం రాజకీయ ఎజెండాలోకి వచ్చింది. వీలైనంత మేర మతాన్ని వాడుకుని అధికారాన్ని పదిలం చేసుకోవాలన్న ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇక బిజెపి లేదా మరి కొన్ని శక్తులు సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల ఘర్షణగా వక్రీకరించే పరిస్థితి నెలకొంది. మహోత్తర తెలంగాణ పోరాటాన్ని మతపరమైన పోరాటంగా మార్చేందుకు బిజెపి లేదా ఇతర మతశక్తులు ప్రయత్నిస్తున్నాయి. దీనిని తొప్పికోడుతూనే దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, నిర్బంధాలు పాలనలో మత జోక్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. గత పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేస్తూనే నేటి తరాన్ని ప్రజా ఉద్యమాల వైపు సన్నద్ధులను చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉంది. కమ్యూనిస్టులుగా ప్రజా బాహుళ్యంలోకి చొచ్చుకునిపోయి విస్తృత కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా పార్టీని విస్తృత పర్చాలి. ప్రజల పక్షాన నిలబడి పోరాడటమే సాయుధ తెలంగాణ పోరాట అమరవీరులకు మనం ఇచ్చే ఘన నివాళి. తెలంగాణ సాయుధ పోరాట వారసులుగా నేటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా పోరాడటమే కర్తవ్యం కావాలి.

# కదులుతున్న సదరం అక్రమ డొంక..!

**(మొదటిపేజీ తరువాయి)**
విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. ఒక సత్తుపల్లి మండలంలోనే లక్షలాది రూపాయలు వసూలు చేసి వందల సంఖ్యలో అర్హత లేకున్నా వికలాంగ ధృవీకరణ పత్రాలు ఇచ్చినట్లు సమాచారం. దీనికి సంబంధించి ఆశ్చర్యపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఓ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి కాదు. అవుట్సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ ఉద్యోగి అంతకన్న కాదు. కేవలం ఫిజియోథెరపిస్టు ఆమె సదరం క్యాంపులకు వచ్చి అక్కడ కూర్చుని సదరం సర్టిఫికెట్ల జారీలో అత్యంత కీలకంగా వ్యవహరించేది. సదరం క్యాంపులకు వచ్చే వారంతా ఆమెనే ఆశ్రయించే వారు. ఆమెకు అంత ప్రాధాన్యతనివ్వడం అంటే ఆమె వసూళ్లలో అప్పటి సదరం క్యాంపు బాధ్యులకు వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. చాలా కాలంగా ఖమ్మం కేంద్రంగా జరుగుతున్న ఈ తతంగంపై ఆరోపణలు వచ్చినా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో మరిన్ని వసూళ్లకు అవకాశం కల్పించింది. ఓ ప్రైవేటు వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో తిష్టవేసి సదరం క్యాంపుల ద్వారా దివ్యాంగుల ధృవీకరణ పత్రాలు, ఒంటరి మహిళ ధృవీకరణ పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని వసూళ్లు చేసిందంటే ఎవరి మద్దతు లేకుండానే ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పని జరుగుతుందా అన్నది ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ఇప్పుడు సదరం సర్టిఫికెట్లకు సంబంధించి నగదు వసూళ్లు చేసి మోసం చేసిన దానితో పాటు జిల్లా వ్యాప్తంగా అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్లు పొంది పెన్షన్ పొందుతున్న అక్రమార్కులపై కూడా విచారణ జరిపించాల్సి ఉంది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం దివ్యాంగులకు నాలుగు వేల రూపాయలు ఇస్తుండడంతో పింఛన్ కోసం అక్రమ పద్ధతుల్లో ధృవీకరణలు సృష్టించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ అక్రమ వసూళ్లలో ఎవరి వాటా ఎంత అన్నది తేల్చాల్సి ఉంది.

## పలువురికి సండ్ర పరామర్శ



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో చెరుకూరి నర్సింహారావు ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకట వీరయ్య బుధవారం వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన షేక్ భాషయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శెట్టిపల్లి లక్ష్మణరావు, సీతారామిరెడ్డి, జమలయ్య, వార్డు మెంబర్లు కృష్ణ, సురేష్, ప్రభాకర్, శ్రీనివాసరావు, నర్సింహారావు పాల్గొన్నారు.

## తల్లాడలో నాయీ బ్రాహ్మణ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నారాయణపురం గ్రామం నుండి కోలాట నృత్యాలతో మహిళలు, యువకులు ర్యాలీగా బయలుదేరి తల్లాడ పట్టణ పురవీధులన్నీ కలియ తిరిగారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాయీ బ్రాహ్మణ సోదరులకు సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ ర్యాలీలో సంఘం జిల్లా అధ్యక్షులు నంద్యాల నర్సింహారావు పాల్గొని మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల ఐక్యత, సంక్షేమం, సామాజిక అభివృద్ధికి కృషి చేయడంతో పాటు సంప్రదాయ వృత్తిని పరిరక్షించేందుకు అందరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించేందుకు సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా బాధ్యులు మునుగోటి వెంకటేశ్వర్లు, రావులపాటి వెంకటేశ్వర్లు, తల్లాడ నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు రాచమల్ల అబి, టౌన్ ప్రెసిడెంట్ పెద్దబ్బాయి, వైస్ ప్రెసిడెంట్ అప్పారావు, రామారావు, సెక్రటరీ శివ, కోశాధికారి కృష్ణ, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, రామారావు, రాఘవ, రామకృష్ణ పాల్గొన్నారు.

## ముదిగొండ వ్యవసాయ అధికారిగా నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల వ్యవసాయశాఖ అధికారిగా వడిత్య నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు నూతన వ్యవసాయ అధికారి రైతులకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# ఒకరి మరణ వార్త విని మరొకరు..

**(మొదటిపేజీ తరువాయి)**
హరిప్రసాద్, సునీత దంపతుల మధ్య స్వల్ప అభిప్రాయ బేధాలు ఇద్దరిని బలిగొన్నాయి. హరిప్రసాద్ బుధవారం ఖమ్మం సమీపంలోని సాగర్ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హరిప్రసాద్ కాలువలో దూకాడన్న విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు ప్రారంభించారు. గాలింపు జరుగుతుండగా భర్త కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలుసుకున్న హరిప్రసాద్ సతీమణి సునీత తీవ్ర మనస్తాపానికి గుర్రై ఉరిపెట్టుకుని బలవన్మరణానికి పాల్పడింది. వారి పిల్లలు భార్గవి, మనోజ్‌లు అనాథలయ్యారు. కొణిజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షణికావేశంలో జరిగిన ఈ ఘటన అమ్మపాలెం గ్రామంలో విషాదాన్ని నింపింది.

# పోరాట యోధుడు గడల సీతారామయ్య

**(మొదటిపేజీ తరువాయి)** మొదలు పెట్టిన వారిలో ముగ్దం మోహినుద్దీన్‌తో పాటు బందగి, సోయబుల్లాఖాన్, రజబ్అలీ తదితరులు పాల్గొన్నారు. గడల సీతారామయ్యను కూడా రజాకారులు చిత్ర హింసలు పెట్టినా, గుర్రాలతో తొక్కించి కోరడాలతో కొట్టించినా ఎత్తిన జెండాను వీడలేదన్నారు. తుదిశ్వాస వరకు నమ్మిన సిద్ధాంతం కోసం నిబద్ధతతో పనిచేసిన గొప్ప నాయకుడన్నారు. పార్టీ విస్తరణ కోసం ఆహర్నిశలు కృషి చేశారన్నారు. నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన నిస్వార్థ నాయకుడన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నేటి తరం తెలుసుకుని వారి స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, దొండపాటి రమేష్, పాపగంటి సుదర్శన్, కోటేశ్వరరావు, స్వర్ణ రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి గడల భాస్కర్, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, చల్లా మోహన్‌రావు, ఉప సర్పంచ్ చల్లా నర్సింహారావు, మిట్టపల్లి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు బానోత్ రామయ్య, లేడిబోయిన సైదులు, బాసా వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి, తుప్పతి మల్లికార్జున్, పోట్లపల్లి నర్సింహారావు, గడల చిన్న సూర్యనారాయణ, శ్రీనివాస్, నాగరాజు, బాషా, కృష్ణయ్య, రాములు, సిపిఎం నాయకులు యాసా వెంకటేశ్వర్లు, తిలక్, కాంగ్రెస్ నాయకులు గడల నరేందర్ నాయుడు, ప్రసాద్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో మంత్రులు భట్టి, పొంగులేటి పర్యటన
### -జాతీయ జెండాను ఆవిష్కరించనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. మల్లు భట్టివిక్రమార్క హైదరాబాద్ నుంచి బయలుదేరి ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొంటారు. అక్కడి నుంచి ముదిగొండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ముదిగొండ గ్రామంలో నూతన లైబ్రరీకి, చిరుమర్రి గ్రామంలో ట్యాంక్ బండ్ అభివృద్ధికి, వనంవారి కిష్టాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ భవనానికి ఆయన శంకుస్థాపన చేస్తారు. వనం కిష్టాపురంలో బిఎల్‌ఏలతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వరంగల్‌లో ప్రజాపాలన దినోత్సవం అనంతరం తిరుమలాయపాలెం మండలం మేడేపల్లి చేరుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి కూసుమంచి క్యాంపు కార్యాలయంకు చేరుకుని డబుల్‌బెడ్‌రూం ఇండ్ల లబ్దిదారులకు పట్టాలు అందజేస్తారు. మునిగేపల్లి గ్రామంలో లబ్దిదారులకు ఇండ్ల పట్టాలు అందజేస్తారు. సిఎంఆర్ చెక్కులను సైతం పంపిణీ చేసిన అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధులతో సమావేశం అవుతారు. అక్కడి నుంచి తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

## నోటీసులపై ఆందోళన
### -భారీగా మోహరించిన పోలీసులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ 27వ డివిజన్‌కు సంబంధించి ఇండ్ల కూల్చివేతకు కార్పోరేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీనిని నిరసిస్తూ పెద్ద సంఖ్యలో ఆందోళన కారులు శ్రీనివాస్ నగర్ ఫ్లైఓవర్‌పై రాస్తారోకో చేపట్టారు. నాలుగైదు గంటలకు పైగా రాస్తారోకో జరుగుతుండడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. 60 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని ఇండ్లు కూల్చివేస్తే తమ పరిస్థితి ఏమిటి అంటూ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆందోళన కొనసాగుతుండడంతో పోలీసులు భారీగా మోహరించారు.

## గడ్డిమందు తాగి తండ్రి బలవన్మరణం
### –ఇద్దరు చిన్నారులకూ విషం..పరిస్థితి విషమం




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురం గ్రామంలో బుధవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీనివాసరావు (44) గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అంతకు ముందు తన కుమారుడు (14), కుమార్తె నిఖిల్ (10) కు కూడా అదే విషపదార్థాన్ని తాగించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు ఈజ్ వెంటనే ముగ్గురినీ ఆసుపత్రికి తరలించారు. అయితే శ్రీనివాసరావు అప్పటికే మృతిచెందగా, ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కుటుంబ కలహాలే కారణమా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# రెచ్చిపోతున్న మైక్రో ఫైనాన్స్ ఏజెంట్లు..!



-వసూలు పేరుతో రోజు రోజుకూ పెరుగుతున్న వేధింపులు
-రాత్రుల్లో కిస్తీలు కట్టాలంటూ తీవ్రమైన ఒత్తిడి
-కిస్తీ గడువొస్తుందంటే భయభ్రాంతులకు గురవుతున్న మహిళలు

ప్రజాపక్షం/జూలూరుపాడు: కొడుకు చదువు, కూతురి పెళ్లి, ఇంకా ఆసుపత్రి ఖర్చులు లేదా పెట్టుబడులు.. ఇలా అవసరం ఏదైనా ఆదుకోడానికి మేమున్నామంటూ అండగా నిలుస్తారు. అవసరం ఎంతైనా ఎలాంటి తనఖా లేకుండానే సాయం చేస్తారు. పెద్ద మొత్తం అప్పుగా తీసుకుని చిన్న మొత్తాలుగా నెల నెలా చెల్లించాలంటూ సున్నితంగా చెబుతారు. ఆశపడి వారి వలలో పడ్డామా.. ఇక అంతే సంగతులు.. వారం వారం చెల్లింపుల్లో ఏమైనా తేడా జరిగిందా పరువు గోవిందా. సామాన్లు బయటపడేసినట్లే. కుటుంబం పరువు నిండా గంగలో కలిసిపోయినట్లే. ఇలా పరువుకు భయపడి మళ్లీ వాళ్ల దగ్గరే ఇంకొంచం పెద్ద వడ్డీకి నగదు తీసుకుని ఆ అప్పును తీర్చడానికి కొత్త అప్పు చేస్తూ వాటికి వడ్డీలు, ఆపైన చక్ర వడ్డీలు నిర్వహణ ఖర్చులు. అపరాధ రుసుంలు చెల్లిస్తూ చివరకు ఆర్థికంగా దెబ్బతిని ఆత్మహత్యలు చేసుకొనేదాక వెళ్తున్నారు.

### మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు..!

జూలూరుపాడు మండలంలో మైక్రో ఫైనాన్స్‌ల లొల్లి మొదలైంది. రెండేళ్ల క్రితం వరకు పెద్ద ఎత్తున తమ కార్యకలాపాలను సాగించి వివాదాల్లో కూరుకుపోయిన ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలు అప్పటి నుంచి కనుమరుగయ్యాయి. అప్పట్లో పోలీసులు అక్రమ మైక్రో ఫైనాన్స్‌లపై కఠిన చర్యలు తీసుకోవడంతో వారంతా గతంలోనే తోకముడిచారు. అయితే కొంతకాలం నుంచి మళ్లీ చాపకింద నీరులా పలు ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలకు చెందిన సిబ్బంది గ్రామాల్లో నివసించే కొంతమంది మహిళా పొదుపు సంఘాల సభ్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి సహకారంతో ఇతర మహిళలకు రుణాలు అంటగట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట్లో అతి తక్కువ వడ్డీ అని చెప్పి రుణాలు ఇచ్చిన ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ఆ తర్వాత వాయిదాల రూపంలో రుణాలు తీసుకున్న మహిళల నుంచి ఎక్కువ వడ్డీ వసూలు చేస్తుండడం వివాదాలకు కారణమవుతున్నది. గత వారం రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ మహిళ ఇంటివద్ద స్పందన ఫైనాన్స్ ఏజెంట్లు రాత్రి 9 గంటల సమయంలో అప్పు కట్టాలని వేధింపులకు గురించేశారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో ఏజెంట్లు అక్కడ నుండి మల్లగా జారుకున్నారు. గ్రామాల్లో మహిళలను ఇబ్బందులకు గురించేస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### కిస్తీ గడువొస్తే భయభ్రాంతులకు గురవుతున్న మహిళలు..

కొన్ని మైక్రో ఫైనాన్స్ సంస్థలు అమాయక మహిళల అవసరాలకు రుణాలు ఇచ్చి వారి నుంచి వాయిదాల రూపంలో వడ్డీ డబ్బులను అధికంగా వసూలు చేస్తున్నాయి. ఒకటి, రెండు రోజులు వడ్డీ చెల్లింపులు ఆలస్యమైతే మహిళలకు పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తూ వారి నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. అధిక వడ్డీపై మహిళలు ప్రశ్నిస్తే మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు దురుసుగా మాట్లాడుతున్నారు. అసలు డబ్బులతోపాటు వడ్డీ డబ్బులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామంటూ మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రుణాలు తీసుకున్నవారితో పాటు గ్యారెంటీగా ఉన్న వారిని వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వున్నాయి. మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వసూళ్ల కోసం తమ ప్రాంతాల్లోకి వస్తున్నారంటేనే రుణాలు తీసుకున్నవారు వణికి పోతున్నారు. ఇప్పటికైనా వారి ఆగడాలకు చెక్ పెట్టాలని బాధితులు కోరుతున్నారు.

### మైక్రో ఫైనాన్స్ కంపెనీలపై నియంత్రణ కరువు..!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏజెన్సీ ఏరియా ఎక్కువగా ఉండడం. ఇక్కడి గిరిజనంలో ఉన్న అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని తక్కువ వడ్డీ పేరిట అప్పులు అంటగట్టడం. సమయానికి అప్పు చెల్లించలేక సతమతమౌతున్న పరిస్థితుల్లో గ్రూపులో ఉన్న ఇతరుల నుంచి వత్తిడి పెట్టడం. పరువు తీస్తామంటూ బెదిరింపులకు పాల్పడడం షరా మామూలుగా మారింది. గతంలో ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ. మారిన పరిస్థితుల్లో సరళీకరణ ముసుగులో మళ్లీ సూక్ష్మ రుణ సంస్థల వసూళ్ల పర్వం కొనసాగుతూనే ఉంది. ఎలాంటి తనఖాలు, లేకుండానే ఉన్నఫళంగా అప్పు ఇస్తుండడమే సామాన్యులు వీరి పాలిట పడి బలైపోవడానికి మార్గంగా ఉంది. వీళ్లంతా స్థానికంగా మండల కేంద్రాలు, పెద్ద పెద్ద గ్రామాల్లో బోర్డులు పెట్టి మరీ తమ కార్యకలాపాలు నిర్వహిస్తుండడం గమనార్హం. అయినా వీరి ఆగడాలను ప్రశ్నించిన దాఖలా లేదు. వ్యాపార కార్యకలాపాలపై ఎవరికీ నియంత్రణ లేకపోవడం ఈ కంపెనీల దారుణాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది.

# గ్రామాల్లో ఫాగింగ్ ఎక్కడ..?





-22 గ్రామపంచాయతీల్లో దోమల బెడద...పనిచేయని పాత మిషన్లు
-ఫాగింగ్‌పై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ప్రజల ప్రశ్న

ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో దోమల నివారణ కోసం చేపట్టాల్సిన ఫాగింగ్ కార్యక్రమం కనుమరుగైనట్లు కనిపిస్తుంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్యలు, నిల్వ నీరు కారణంగా దోమల బెడద తీవ్రంగా పెరిగినా అధికారులు ఫాగింగ్‌పై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఇళ్ల వద్దనే కాకుండా రోడ్లపై కొద్దిసేపు నిలబడి మాట్లాడుకోవాలన్నా దోమల బెడద తట్టుకోలేకపోతున్నామని పలువురు చెబుతున్నారు.

### పనిచేయని పాత మిషన్లు..

కొన్ని గ్రామపంచాయతీల్లో ఉన్న ఫాగింగ్ మిషన్లు పాతబడిపోయి వినియోగానికి పనికిరాని పరిస్థితిలో ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మిషన్లు పనిచేయకపోతే కొత్త ఫాగింగ్ మిషన్ల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపి ఉంటే వాటిని ఎందుకు సమకూర్చుకోలేకపోయారని నిలదీస్తున్నారు.

### ప్రజల ఆరోగ్యాలపై నిర్లక్ష్యమెందుకు?

గ్రామాల్లో దోమల బెడద రోజురోజుకు పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఫాగింగ్ నిర్వహించేందుకు ఆయా గ్రామపంచాయతీ అధికారులు షెడ్యూలు రూపొందించారా. దోమల నివారణ ప్రతి పంచాయతీలో ఉన్న నిధులు ఎంత. ఆ నిధులను ఎలా ఉపయోగిస్తున్నారు అనేది అధికారులు ప్రజలకు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పారిశుద్ధ్య లోపాలు, మురుగు కాల్వలు, నిల్వ నీటితో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, అయినప్పటికీ ఫాగింగ్ కార్యక్రమం చేపట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయాలనే విషయాన్ని అధికారులు మరిచిపోయారా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. 22 గ్రామపంచాయతీల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించి దోమల బెడదను అరికట్టాలని, ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో పృతించి పరిస్థితి పరిశీలించి అవసరమైన చోట్ల కొత్త ఫాగింగ్ మిషన్లను సమకూర్చడంతో పాటు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాపక్షం /గుండాల : మండల పరిధిలోని కాచనపల్లి మోడల్ స్పోర్ట్స్ క్రీడా పాఠశాల యందు విద్యార్థులకు మండల స్థాయి క్రీడలను మండల విద్యాశాఖ అధికారి పార్వతమ్మ ప్రారంభింప చేశారు. మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనపరిచారని , ఇక్కడ ఎంపిక అయిన విద్యార్థిని విద్యార్థులు ఇల్లందు డివిజన్లో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె వెంకటేశ్వర్లు, వార్డెన్ జి పాపయ్య, కాచనపల్లి సర్పంచి కిషన్, ఉప సర్పంచి అశోక్ , మరియు పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు , వ్యాయామ ఉపాధ్యాయులు , క్రీడా శిక్షకులు పాల్గొనగా క్రీడా పోటీలకు 240మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాం అందించాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: విద్యా సంస్థల చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫామ్స్ అందజేయకపోవడం ఏమిటని ప్రభుత్వం వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే విద్యార్థులకు యూనిఫాం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని వంశీ డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని వంశీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు అనిల్ కుమార్, సాయి ఈశ్వర్, లితికేష్, జంబో, హరి, శిరీష, సింధు, బన్నీ, నందిని, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విచారణకు హాజరు కండి

- తహశీల్దార్ రవికుమార్

ప్రజాపక్షం/భద్రాచలం : ఓటర్ సవరణలో భాగంగా జగుతున్న పరిశీలనలో నోటీసులు అందిన వారు తమ పేర్లను, తమ కుటుంబీకుల పేర్లు సరిగా ఉన్నాయో లేదు పరిశీలించుకోవాలని, ఇందుకోసం జరిగే విచారణకు హాజరై సహకరించాలని తహశీల్దార్, ఏఈఆర్ఓ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని నిర్ణీత తేది నాడు జరిగే విచారణకు విధిగా హాజరు కావాలని, నిర్ధారణ కోసం తమ వద్ద ఉన్న 10 మెమో, పాస్‌బుక్, పాన్‌కార్డు, నివాస ధృవీకరణ పత్రం, అటవీ హక్కుల పత్రం లలో అందుబాటులో ఉన్న వాటిని సమర్పించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఎల్ఏలు ఈవిషయంపై ప్రజలకు అవగాహన కల్పించి ఎస్ఐఆర్ 2026 కార్యక్రమం విజయవంతానికి సహకరించాలన్నారు.

## పాఠశాలలోకి వెళ్లేదెలా...?

-ప్రహరీ నిర్మాణం పేరుతో గుంతలు
-చిన్నారులకు పొంచి ఉన్న ప్రమాదం



ప్రజాపక్షం/ములకలపల్లి: మండలంలోని నల్లివారిగూడెం ప్రాథమిక పాఠశాల వద్ద ప్రహరీ గోడ నిర్మాణ పనులు పూర్తయినా ప్రమాదకర గుంతలను పూడ్చకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల గోడకు, సీసీ రోడ్డుకు మధ్య సుమారు మూడు అడుగుల వెడల్పు, రెండు అడుగుల లోతులో గుంతలు ఏర్పడ్డాయి. పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో చిన్నారులు తరచూ ఈ గుంతలను దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని తెలిపారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు ట్రాక్టర్లు ఇదే మార్గంలో తిరుగుతుండటంతో సీసీ రోడ్డుకు పగుళ్లు ఏర్పడి మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణం చేపట్టిన గుత్తేదారుడిపై చర్యలు తీసుకుని గుంతలను వెంటనే పూడ్చి, విద్యార్థులకు సురక్షిత రాకపోకలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ప్రజాపక్షం/కూసుమంచి: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి పిలుపునిచ్చారు. కూసుమంచి మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కూలీల ఆదాయాలు తగ్గుతుండగా కార్పొరేట్ సంస్థల ఆదాయాలు పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. పంటలకు మద్దతు ధర కల్పించి 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీ అమలు కాలేదని విమర్శించారు. రైతు, కార్మిక సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని భిక్షపతి పిలుపునిచ్చారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాపక్షం/కూసుమంచి: చదువు మధ్యలో నిలిపివేసి రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్లలేని వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివే అవకాశం కల్పిస్తున్నట్లు కూసుమంచి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ వీరాస్వామి తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, సెప్టెంబర్ 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పదో తరగతికి టీసీ, జనన, కుల, ఆధార్ ధ్రువపత్రాలతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఇంటర్మీడియట్‌కు పదో తరగతి మార్కుల పట్టిక, కుల, ఆధార్ ధ్రువపత్రాలు, ఫొటోలతో కూసుమంచి ఉన్నత పాఠశాలను సంప్రదించాలని సూచించారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుందని, ఉన్నత విద్య, ఉద్యోగాలు, పదోన్నతులకు అర్హత ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కూసుమంచి సెంటర్ కో ఆర్డినేటర్ డా.టీ శోభన్ బాబు 9948597174ను సంప్రదించాలని కోరారు.

## ఘనంగా వరల్డ్ బార్బర్స్ డే వేడుకలు

ప్రజాపక్షం/అశ్వాపురం: వరల్డ్ బార్బర్స్ డే సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అశ్వాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం 5వ వరల్డ్ బార్బర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆరాధ్య దైవం ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 50ఏళ్లుగా బార్బర్ వృత్తిలో కొనసాగుతున్న సీనియర్ సంఘ నాయకుడు చింతిర్యాల సీతారాములు సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరసవల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల సేవలను గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో తాటిపాముల ఐలయ్య, దడిగల కొండయ్య, మాదుగుల సమ్మయ్య, యాసాని వెంకటరమణ, సంఘ నాయకులు, సభ్యులు, వివిధ గ్రామాల నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

**-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**





**ప్రజాపక్షం/ఏన్కూరు:** భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతు పోరాటం చరిత్రలో గొప్ప పోరాటమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని మేడపల్లి గ్రామంలో తాటి సత్యం, తాటి సీతమ్మ స్థూపాల వద్ద జరిగినా సభలో ఆయన మాట్లాడారు. తొలిత స్థూపాల వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ జెండాని ఆవిష్కరించారు. ఈసందర్భంగా హేమంత్‌రావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, జమీందార్లు, జగిర్దర్లకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం 5వేల గ్రామాలను, 10వేల ఎకరాల భూమి పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణను విముక్తి చేసి భారతదేశంలో విలీనం చేయడంలో అనేక కమ్యూనిస్టుల ప్రాణత్యాగాలతో జరిగిందని, అలాంటి గొప్ప పోరాటాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నల్లమల గిరి ప్రసాద్ దళంలో పని చేసిన తాటి సత్యం, తాటి సీతమ్మ ధన్యజీవులన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు యర్రా బాబు, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, జిల్లా సమితి సభ్యులు అమరనేని వీరభద్రం, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బానోత్ రాంబాబు, మండల నాయకులు మదినేని రమేష్, గ్రామ సర్పంచ్ బండ్ల స్వాతి, కృష్ణారావు, తిరుపతమ్మ, సూరమ్మతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

**-ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** అమరుల ఆశయాలను కొనసాగిద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. బుధవారం సీపీఐ ములకలపల్లి మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కార్యక్రమం చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి ఎండి యూసఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్మించడమే నిజమైన నివాళి అన్నారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నకరికంటి పుల్లారావు, బైరు సాయి బాబు, ముఖ్యర వెంకన్న, తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రకటించాలి




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ముువ్వ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బూర్గంపాడు మండలం సారపాకలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి, పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టులు, రైతులు, కార్మికుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలని కోరారు. నిజాం, భూస్వామ్య నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటం భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి, సమానత్వం కోసం జరిగిందన్నారు. సీపీఐ నాయకత్వంలో సుమారు 24లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి పేరాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, సీపీఐ మండల కార్యదర్శి సబ్బం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి పాండవుల బిక్షం, సిద్దార్థ సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు బర్ల వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఎండీ సాజిద్ జహీర్, వీ చారి, ప్రజానాట్యమండలి కాటూరి రాము, వార్డు సభ్యులు గుగులోతు భీమా, పేరం వెంకటేష్‌రెడ్డి, వహీదు, తోకల శ్రీను, బి వేణు, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వనాథపల్లిలో పశువైద్య శిబిరం



**ప్రజాపక్షం/కారేపల్లి:** పశువుల ఆరోగ్య పరిరక్షణ, సంతానోత్పత్తి మెరుగుదల లక్ష్యంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విశ్వనాథపల్లిలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించగా, ఉప సర్పంచ్ బొమ్మల ధనమ్మ పాల్గొన్నారు. సింగరేణి మండల పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులను తొలిదశలో గుర్తించి చికిత్స అందించాలని, పశువులకు సమతుల్య పోషకాహారం, ఖనిజ లవణాలు అందించాలని సూచించారు. ఎద లక్షణాలను గుర్తించి సకాలంలో కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. సెక్స్ సార్టెడ్ సీమెన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ వెంకటేష్, గోపాలమిత్రులు మంగయ్య, శ్రీకాంత్, సమ్మయ్య, రామారావు, రవి, రైతులు పాల్గొన్నారు.

## తాళ్లచెరువు సర్పంచి ఎన్నికపై

# పిటిషన్ ఈనెల 21కి వాయిదా

**- చెల్లని ఓటును చెల్లించి ఒక్క ఓటుతో పరాజయమైనట్లు ప్రకటించిన రిటర్నింగ్ అధికారి**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని తాళ్లచెరువు గ్రామపంచాయతీ సర్పంచి ఎన్నికల్లో ఒక ఓటుతో పరాజయం అయినట్లు ప్రకటించిన ఎన్నికను సవాల్ చేస్తూ కోర్టుని ఆశ్రయించిన గడిపూడి వీరభద్రానికి ఊరట లభించింది. తాళ్ల చెరువు గ్రామపంచాయతీలో 14డిసెంబర్2025న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి స్రవంతి కుట్రపూరితంగా వ్యవహరించి పోటీపడిన ఇద్దరు సర్పంచి అభ్యర్థులు గడిపూడి వెంకటనారాయణ, గుడి వీరభద్రంలకు సమాన ఓట్లు వచ్చాయని ప్రకటించిన రిటర్నింగ్ అధికారి కౌంటింగ్ అనంతరం చెల్లని ఓటును ఒకటి చెల్లిందని ప్రకటించి గడిపూడి వెంకటనారాయణను గెలుపొందినట్లు ప్రకటించగా ఆ గెలుపును సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించిన వీరభద్రంకు ఊరట లభించింది. డిసెంబర్14న ఫలితాలను ప్రకటించగా 17న కోర్టును ఆశ్రయించిన వీరభద్రానికి కౌంటర్ పిటిషన్ దాఖలు చేయకపోవడంతో మళ్లీ రీకౌంటింగ్ పెట్టే అవకాశం ఉన్నట్లు గడిపూడి వీరభద్రం తరపు సీనియర్ న్యాయవాది పార్టీపండ్ల సంజయ్ తెలిపారు. ఖమ్మం జిల్లా కోర్టులో బుధవారం జరిగిన వాదనలు విన్న జిల్లా న్యాయమూర్తి సెప్టెంబర్21కు పిటీషన్‌ను వాయిదా వేశారు. పిటీషనర్ గడిపూడి వీరభద్రం రిటర్నింగ్ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ ఉద్యోగం నుంచి తొలిగించి ఎన్నికల్లో పోలైన ఓట్లను రీకౌంటింగ్ చేయాలని కోరారు.తప్పిదం బయటపడితే రికార్డింగ్ పెడితే గడిపూడి వీరభద్రం సర్పంచి అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ఏది ఏమైనా కోర్టు తీర్పు వచ్చేవరకు ప్రస్తుతం కొనసాగుతున్న పాలకమండలికి తలనొప్పి వ్యవహారమే ఇది కోర్టు తీర్పు కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రోస్టర్ విధానంలో మార్పులు చేయాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల మా సామాజిక వర్గ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని మాల మహానాడు మండల అధ్యక్షుడు జినుగు దాసు ఆరోపించారు. సారపాక సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోస్టర్ విధానంలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసి మాలలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో మాలలు కీలక పాత్ర పోషించినప్పటికీ, ఎస్సీ వర్గీకరణ అంశంతో తమకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో 10వ వార్డు సభ్యుడు పాటి అశోక్, దాసరి మోహనరావు, కొంగ మహేష్, మంద కీర్తి కుమార్, చెలికాని శివరామకృష్ణ, చెలికాని లక్ష్మణ్, నక్క రామారావు, చెలికాని వెంకటరత్నం, నక్క రామకృష్ణ, మేకల రమేష్, చెలికాని మణికుమార్ పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమ శిక్షణతో కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలని మండల ప్రత్యేక అధికారి ఎండి ముజాహిద్ ఖాన్ సూచించారు. బుధవారం స్థానిక గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన ఆయన తరగతి గదులు, గ్రంథాలయం, డార్మెంటరీ, భోజనశాల, వంటగదిని పరిశీలించారు. టీఎల్‌ఎం ద్వారా ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, వారితో ముచ్చటించారు. పట్టుదల, నైతిక విలువలు అలవర్చుకుని లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పల్లిభాగ్యశ్రీ, ఎంఈవోవాసవిదేవి, ప్రిన్సిపాల్ వేమురాజు, ఏటీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఘనంగా మహా అన్నప్రసాదం



**ప్రజాపక్షం/గుండాల:** గుండాల మండలం సుభాష్‌నగర్‌లోని వరసిద్ధి వినాయక మండపం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మహా అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గడ్డం రాంబాబు, సుజాత, వైష్ణవి, వర్షిత కుటుంబ సభ్యులు అన్నదానికి సహకరించారు. దాత కుటుంబానికి ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదం స్వీకరించారు. అన్నదానం ప్రజల్లో సేవాభావం, ఐక్యతను పెంపొందిస్తుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో గుండాల ఎస్ఐ శ్రవణ్ కుమార్, వ్యాపారవేత్తలు మానాల ప్రభాకర్, మానాల ప్రణీత్, తిరుక్కోవళ్ళూరి వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, పాత్రికేయులు, గ్రామస్తులు, భక్తులు, యువత, చిన్నారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫాం, షూలు పంపిణీ




**ప్రజాపక్షం/కామేపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అందిస్తున్న రెండు జతల యూనిఫామ్, షూలు, రెండు జతల సాక్స్‌లను కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బి విద్యాసాగర్, ఏపీఎం రామారావు, సీసీ చైతన్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ అధ్యాపకులు ఎం సతీష్, పి వెంకట్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# గణపతి మండలం వద్ద మహా అన్నదానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం కారేపల్లి క్రాస్ రోడ్(రామలింగాపురం)లో వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గణపతి మండపం వద్ద బుధవారం మేకల రాంబాబు, ఉమా దంపతుల వితరణగా మహాబూ అన్నదానం నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చి గణనాథుడిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు మేకల మానస, మౌనిక, రిస్విత కృష్ణ, గ్రామ పెద్దలు, యువత, గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మద్దుకూరు గ్రామానికి చెందిన తంబళ్ల రమేష్ బాబు(బైక్ నడుపుతున్న వ్యక్తి)చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఈనెల 8న రాత్రి7:30గంటల సమయంలో చంద్రుగొండలోని బాలు రైస్‌మిల్లు వద్ద పని ముగించుకుని రమేష్ బాబు ద్విచక్ర వాహనంపై మద్దుకూరు వెళ్తుండగా, చంద్రుగొండ నుంచి మద్దుకూరు వైపు వస్తున్న నల్లమోతు రాజశేఖర్ నడుపుతున్న యాక్టివా అతని బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ బాబు తలకు తీవ్ర గాయాలయ్యాయి. తొలుత కొత్తగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని సాయి మారుతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 16న ఉదయం 11:30గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య తంబళ్ల కీర్తి ఫిర్యాదు మేరకు చంద్రుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు తుది జాబితాలో ఉండాలి

## -రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్క ఓటరు తుది జాబితాలో స్థానం పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ దివాకర టిఎస్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సవరించిన షెడ్యూల్, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు వ్యవధి అక్టోబర్ ఏడు వరకు ఉందన్నారు. నోటీసుల డిస్పోజల్, అప్పీల పరిష్కారానికి నవంబర్ ఐదు వరకు గడువు ఉందని తుది ఓటరు జాబితా నవంబర్ తొమ్మిదిన ప్రచురించనున్నట్లు తెలిపారు. నూతనంగా ఓటరు నమోదు కోసం ఫారం 6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ కాపీని తప్పనిసరిగా జత చేయాలన్నారు. ఫిజికల్ హియరింగ్ సమయంలో దరఖాస్తుదారునితో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరు కావాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 175841 నోటీసులకు గాను ఇప్పటి వరకు 160623 నోటీసులు పంపిణీ చేసి 91.34 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఇప్పటి వరకు 81446 మందికి విచారణ పూర్తి చేసి దరఖాస్తులను పరిష్కరించా మన్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో 12వేల నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఖమ్మం నగర పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన ఓటర్లు అందుబాటులో లేకపోవడం వల్ల నోటీసుల పంపిణీకి ఇబ్బంది ఎదురవుతుందని ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పదవ తరగతి సర్టిఫికెట్లను, గ్రామీణ ప్రాంతాల్లో కుల ధృవీకరణ పత్రాలను ఆధారాలుగా చూపుతున్నారని కలెక్టర్ తెలిపారు. ధృవీకరణ పత్రాల జారీపై అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్‌డిసి సదానందం, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కార్మికుల నిరవధిక సమ్మెతో నిలిచిన కార్మికుల సేవలు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని మున్సిపాలిటీ కార్మికుల సమ్మె బుధవారం నుండి ప్రారంభం కావడంతో పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ నిరవధిక సమ్మెకు దిగారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో చెత్త సేకరణ నిలిచిపోవడంతో రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో ఉండటంతో చెత్తతో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత తొమ్మిది నెలలుగా వేతనాలు అందించడంలో కల్లూరు మున్సిపాలిటీ వేతనాలు అందించడంలో కార్మికుల కు గతంలో నిరవధిక సమ్మె నిర్వహించి అధికారుల పాలకవర్గం హామీతో విరమించడం జరిగిందని విధి లేని పరిస్థితుల్లో నిరవధిక సమ్మెకు పోవడం జరిగిందని పేర్కొన్నారు. వేతనాలను అందిస్తేనే సమ్మెను విరమిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సింగ్ నరసింహారావు జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అధ్యక్షులు శివరామకృష్ణ లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బి కే యం యు జిల్లా నాయకులు




దండు ఆదినారాయణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు, సిపిఐ మండల కన్వీనర్ కొత్తపల్లి వెంకటనారాయణ, మున్సిపాలిటీ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ఓడల కృష్ణమూర్తి, కార్యదర్శి వజీర్‌మియా, ప్రకాష్, చింతపల్లి శ్రీను, యశోద చిన్న పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ప్రత్యేక తనిఖీ బృందం



**ప్రజాపక్షం/మధిర :** ప్రాంతీయ ఉప సంచాలకులు మార్కెటింగ్, వరంగల్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో మార్కెట్‌యార్డ్‌లు, కోల్డ్ స్టోరేజీలు, చెక్‌పోస్టుల ద్వారా రవాణా అయ్యే వివిధ రకాల సరుకుల వ్యాపార కార్యకలాపాలను సమర్ధవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక తనిఖీ బృందం ఏర్పాటు చేసినట్లు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఖమ్మం జిల్లా మార్కెటింగ్ అధికారి రత్నం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలో మిర్చి వ్యాపారం నిర్వహించే ప్రతి వ్యాపారి, కోల్డ్ స్టోరేజి యజమాని నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ట్రేడింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా మార్కెటింగ్ అధికారి రత్నం, సంతోష్‌కుమార్, ప్రత్యేక తనిఖీ బృందం సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది, మిర్చి వ్యాపారులు, కోల్డ్ స్టోరేజీ యజమానులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వైరా విద్యార్థినులు



**ప్రజాపక్షం/వైరాః** జిల్లాస్థాయి కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వైరాలోని కె.విశ్వం కళాశాలలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థినిలు డి.త్రివేణి, తపస్వివలను రీజనల్ కోఆర్డినేటర్ రాంబాబు, ప్రిన్సిపాల్ రాధిక, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోను ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని విద్యార్థినిలకు శుభాకాంక్షలు తెలిపారు.

# యూపిఐపై చార్జీల దోపిడీ పేదోడి జేబు కొట్టే కుట్ర

## - జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ప్రజాపక్షం/ ఖమ్మం టౌన్ :** సామాన్యుడు డిజిటల్ పేమెంట్ చేస్తే కూడా చార్జీల పేరుతో దోచుకోవాలని చూస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు దారుణమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ ధ్వజమెత్తారు. కొత్తగా యూపిఐ పేమెంట్లపై చార్జీలు వసూలు చేయాలని కేంద్రం యోచిస్తుండటంపై ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు మాఫీ చేసే మోదీ ప్రభుత్వం సామాన్యుడి చెమట డబ్బుపై కన్నేసిందని, బ్యాంకుల్లో మినియం బ్యాలెన్స్ లేదని దోపిడి చేస్తుందని, ఇప్పుడు యూపిఐ చేస్తే దోపిడి చేసేందుకు కుట్ర చేస్తుందని, యూపిఐ చార్జీల ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరిచి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

# సాగర్ జలాలతో రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సాగర్ జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవడంతో పాటు నేలకొండపల్లి మండలంలోని అన్ని కుంటలు, చెరువులను తక్షణమే నీటితో నింపాలని బీజేపీ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం బీజేపీ నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌పీ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం పేరుతో సాగర్ జలాలను విడుదల చేయకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు అనంత ఉపేందర్ గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, నాయకులు పురాణం దివాకర్, పిట్టల సూరిబాబు, ఎస్కే షరీఫుద్దీన్, కిసాన్ మోర్చా మండల కన్వీనర్ సూరేపల్లి జ్ఞానరత్నం, గెల్లా చక్రపాణి, తుపాకుల సంజన, కొండ హర్షవర్ధన్, ధారావత్ వీరు నాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జి కే.గోపి తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడలు ప్రారంభం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం పిఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ రఘునాథపాలెంలో ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, ఎంఈవో డి. శ్రీరాములు, సర్పంచ్ గాజుల కృష్ణారావు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, మండల క్రీడా కన్వీనర్ ఎం. వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రెంట్యాల ప్రసాద్, మందా వెంకటయ్య, పిడిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట సంత మార్కెట్‌ను సందర్శించిన విద్యార్థులు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేటలో ప్రతి బుధవారం జరిగే సంత మార్కెట్‌ను బిఎస్సీ అగ్రికల్చర్ మూడవ సంవత్సరం విద్యార్థులు విద్యా పర్యటనలో భాగంగా సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులు మార్కెట్‌లో విక్రయిస్తున్న వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులు, వినియోగ వస్తువులు, ఇతర వస్తువులపై వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. సంత మార్కెట్‌లోని వాస్తవ వ్యాపారపరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థులు మార్కెట్‌పై ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఐ.కృష్ణతేజ, కళాశాల అసోసియేట్ డీన్ డా.జె.హేమంతకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

# త్రివేణిలో ఓజోన్ పరిరక్షణపై అవగాహన



**ప్రజాపక్షం/ ఖమ్మం టౌన్ :** వరల్డ్ ఓజోన్ డేను పురస్కరించుకుని ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని త్రివేణి పాఠశాలోబుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు చిన్న నాటి నుంచే ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఓజోన్ పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తీకరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన టాప్ 5 విజేతలకు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జి విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌ఫోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు షూ, సాక్సులు పంపిణీ



**ప్రజాపక్షం/మధిరః** ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిరలో ప్రిన్సిపాల్ జి.శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు షూ, సాక్సుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, పరిశుభ్రతతో కళాశాలకు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ బానోతు రమణానాయక్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**ప్రజాపక్షం/మధిరః** మధిర మండలం నాగవరప్పాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సైకిళ్ళ అవసరాన్ని ఎన్ఆర్ఐ ఫౌండేషన్‌కు తెలియజేశారు. దీనికి ఎన్ఆర్ఐ ఫౌండేషన్ నిర్వాహకులు తాళ్లూరి జయశంకర్ కుమార్తె భావన స్పందించారు. జిల్లా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ద్వారా భావన విద్యార్థులకు సైకిళ్లను అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థుల కోసం ఎన్ఆర్ఐ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ప్రెసిడెంట్ బయ్యన బాబురావు, తాళ్లూరి జయశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తొలి రోజు 10 మంది రైతులు, 17 ఎకరాలు పూర్తి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోరకు చేపట్టిన భూ రీసర్వే మండలం లోని కొంగర లో ప్రారంభమైంది. గ్రామంలో మొత్తం 234 మంది రైతులు, 656 ఎకరాలను గుర్తించారు. రైతులకు నోటీసులు జారీ చేశారు. నోటీ సుల ప్రకారం షెడ్యూల్ ను ప్రకటించారు. వాటిలో తొలి రోజు సర్వే లో 10 మంది రైతులకు చెందిన 17 ఎకరాలను సర్వే పూర్తి చేశారు. ముగ్గురు సర్వేయర్ లు, నలుగురు జీపీవోలు ఒక టీమ్ గా ఏర్పడి సర్వేను చేపట్టారు. సర్వే ను క్షేత్ర స్థాయిలో సందర్శించిన తహశీల్దార్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.రాంప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్వేయర్లు, జీపీవో లు పాల్గొన్నారు.

# రమేష్‌కు సర్పంచుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా వేంసూరు మండలం లింగపాలెం సర్పంచ్ యర్రా రమేష్ నియమితులయ్యారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్, వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన నియామకంపై పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# విపత్తులను ఆపదమిత్రులు సమర్థవంతంగా ఎదుర్కోవాలి



**- కలెక్టర్ అంకిత్**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : విత్తులు సంభవించిన సమయంలో తక్షణమే స్పందించి ప్రాణ ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపద మిత్రులు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండలం చాతకొండ 6వ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్రుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం సమర్పించిన అనంతరం ఆయన జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భౌగోళిక వాతావరణ పరిస్థితుల వైవిధ్యం కారణంగా దేశంలో వివిధ రకాల విపత్తులు సంభవించే అవకాశం ఉందని, జిల్లాలో గోదావరి వరదలు, ఆకస్మిక వరదలు నీటి ముప్పు అటవీ అగ్నిప్రమాదాలు పారిశ్రామిక ప్రమాదాలు తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉందన్నారు. అధికారిక సహాయక బృందానికి సంఘటనా స్థలానికి చేరుకునే లోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపద మిత్రులు తక్షణ సహాయ చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణ నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. విపత్తుల సమయంలో శారీరధారుడ్యంతో పాటు మానసిక అప్రమత్తత సమయస్ఫూర్తి పరిస్థితిని వేగంగా అంచనా వేసే సామర్థ్యం సరైన నిర్ణయం తీసుకునే నైపుణ్యం ఎంతో కీలకమని తెలిపారు. శిక్షణలో భాగంగా ప్రామాణిక నిర్వహణ విధానాలు సమాచార ప్రసారం రెస్క్యూ పరికరాలు వినియోగం బృంద సమన్వయం వంటి అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం శిక్షణా కిట్లను తొలివిడతగా 120 మందికి బెటాలియన్ కమాండెంట్ పిసివి రమణతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీధర్ రాజా అసిస్టెంట్ కమాండెంట్ మరియదాస్ లక్ష్మీ దేవిపల్లి తహశీల్దార్ శిరీష ఎంపిడిఓ సుచిత్ర పోలీస్, రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖల అధికారులు శిక్షకులు అపదమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం వాగు దాటిన అదనపు కలెక్టర్

**-బైక్‌పై ప్రయాణించి పొలాల్లో రీ సర్వే పరిశీలన**



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: రైతుల భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వినూత్నంగా క్షేత్రస్థాయికి వెళ్లారు. నర్సాపురం రెవెన్యూ గ్రామంలో వాగులో వరద నీరు ప్రవహిస్తుండటంతో కారు దిగి రైతు భీమిరెడ్డి వెంకటరామిరెడ్డి ద్విచక్ర వాహనంపై వాగు దాటి పొలాలకు చేరుకున్నారు. తహసీల్దార్ స్వర్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించిన ఆయన రైతుల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, నిబంధనల ప్రకారం భూములను సంబంధిత రెవెన్యూ గ్రామాల్లో నమోదు చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. రైతులతో సమన్వయం చేసుకుంటూ సర్వేను వేగంగా పూర్తి చేయాలని, సర్వేయర్లు ప్రతి రోజూ రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏడి శ్రీనివాసరావు, ఆర్ఐ సోడే రత్తయ్య, జీపీఓ బాలకృష్ణ, సర్వేయర్లు ప్రియాంక, రాజేశ్వరి, పల్లవి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# గొందిగూడెంలో ఇంటింటికి పింఛన్ వెరిఫికేషన్





ప్రజాపక్షం/అశ్వాపురం: గొందిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలో చేయూత పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హత పత్రాల పరిశీలనను బుధవారం ఇంటింటికి వెళ్లి నిర్వహించారు. వెరిఫికేషన్ అధికారి, అశ్వాపురం ఎంపీడీవో ముత్యాలరావు స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులు, పత్రాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ తాటి వెంకటలక్ష్మీ, ఉప సర్పంచ్ కే గంగయ్య, పంచాయితీ కార్యదర్శి మధుసూదన్‌రావు, మండల, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

**పినపాక నియోజకవర్గ ఈఆర్ఓ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్**



ప్రజాపక్షం/మణుగూరు: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని పినపాక నియోజకవర్గ ఈ ఆర్ ఓ మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత తహశీల్దార్లకు ఆదేశించారు. బుధవారం మణుగూరు లోని సమితి సింగారం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించిన అనంతరం మణుగూరు తహశీల్దార్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో సర్ ఓటర్ నమోదు ప్రక్రియ పై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు నోటీసుల జారీ, నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న కేసులు, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన, క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, అనర్హులైన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల మేరకు సమగ్ర పరిశీలన నిర్వహించాలని ఆయన సూచించారు. అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు నిరాకరించబడకుండా చూడటంతో పాటు, అర్హత లేని వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఓటర్ల పేర్ల తొలగింపుకు సంబంధించిన ప్రతి కేసును నిబంధనల మేరకు సమగ్రంగా పరిశీలించి, కారణాలను స్పష్టంగా నమోదు చేస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మణుగూరు తహసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఎలక్షన్ డ్యూటీలు అనూష, రామారావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యపై మక్కువ చూపండి



ప్రజాపక్షం/భద్రాచలం : తల్లిదండ్రులు ప్రభుత్వవిద్యపై మక్కువ చూపాలని సర్పంచ్ పూనెం కృష్ణ సూచించారు. తాతగుడి సెంటర్లో నూతనంగా ప్రారంభమైన ప్రీ ప్రైమరీ పాఠశాల్లో విద్యార్థులకు ఏక రూపదుస్తులు బెల్టులు, టైలు పుస్తకాలను ఎంఇఒ బెక్కంటి శ్రీనివాస్ రావు తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల వసతులతో ఉచిత విద్యను అందిస్తోందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు చదువులు చెబుతున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ తమ దృష్టికి వచ్చిందని, ప్రైవేటు మోజులో పడి చక్కటి నాణ్యమైన ప్రభుత్వ విద్యను విస్మరిస్తున్నారని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుని మీ పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దు కోవాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయురాలు శిరీష మాట్లాడుతూ ప్రస్తుతానికి పిల్లలు తక్కువగానే ఉన్నారని శనివారం నాటికి 30 మంది విద్యార్థుల వరకు పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాన్సన్ పాపయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో కదులుదాం

**- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి**





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నేటి దోపిడీ విధానాలపై రాజీలేని ఉద్యమాలు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం సిపిఐ రామవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రామవరం సెంటర్లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు అమరవీరు స్థూపం వద్ద ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి నిజాం నిరంకుశ పాలనను భూ స్వామ్య గడీల అరాచకాలను ఎదిరించి సమ్యూనిస్టుల నాయకత్వంలో పేద ప్రజలు సాగించిన వీరోచిత పోరాటం ప్రపంచ చరిత్రలో అపూర్వమైందన్నారు. భూమికోసం భుక్తికోసం ప్రాణాలర్పించిన నాలుగు వేల మంది అమరుల ఆశయాల సాధనకు ప్రతీ కార్యకర్త పునరంకితం కావాలన్నారు. నేటి పాలకులు ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ పేద మధ్య తరగతి ప్రజల హక్కులను తిప్పి కొట్టేందుకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఏకం చేసి పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య జి వీరస్వామి ఎస్‌కే ఫహీమ్‌దాదా జిల్లా సమితి సభ్యులు భూక్య శ్రీనివాస్ నేరెళ్ల రమేష్ ఏరియా నాయకులు మర్రి గోపి తూముల శ్రీనివాస్ మండల రాజేశ్వరరావు పెయ్యల రంగారావు నగేష్ సింగాల రమేష్ అంకూస్ కార్పొరేటర్ కూరపాటి సుధాకర్, సర్పంచ్ వాదె రాములు మాటేటి గోపాల్ దబ్బేటి గురుమూర్తి ఖయ్యూమ్ బరిగెల భూపేష్ గుత్తుల శ్రీనివాస్ అల్లకొండ సాయిలు సురీనేని రామారావు తొగరు నరేందర్ జలీల్ శంకర్ ఈశ్వరయ్య రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద మహిళలకు ఐటీసీ బంధన్ చేయూత



ప్రజాపక్షం/బూర్గంపాడు: నిరుపేద ఒంటరి, వితంతు మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఐటీసీ బంధన్ సంస్థ విశేష కృషి చేస్తోందని ఏపీఎం మీసాల హేమంతిని అన్నారు. బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు రిఫ్రెషర్ శిక్షణ నిర్వహించారు. లబ్ధిదారులకు వారి అభిరుచులకు అనుగుణంగా ఫ్యాన్సీ, కిరాణా, హోటల్, వస్త్ర, కూరగాయలు, పండ్ల వ్యాపారాలతో పాటు కుట్టు మిషన్లు అందించి స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార నిర్వహణ, లాభాల పొదుపుపై శిక్షణతో పాటు ప్రతి వారం లబ్ధిదారుల వ్యాపారాలను పరిశీలించి సూచనలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పోస్టాఫీస్ ద్వారా పొదుపు ఖాతాలు, బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. 2015 నుంచి సంస్థ బూర్గంపాడు మండల పరిసర గ్రామాల్లో సేవలందిస్తోందని, ఇప్పటి వరకు సుమారు 1,800 మంది మహిళలకు వివిధ రూపాల్లో సహాయం అందించిందన్నారు. ఒక్కో లబ్ధిదారుకు సుమారు రూ 13వేల విలువైన ముడిసరుకులు అందిస్తూ జీవనోపాధికి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బంధన్ ఏసీ ఉత్తమ్ మార్టిన్, టీమ్ లీడర్ భూక్య కుమార్, ఏడీఎస్‌సీ సభ్యుడు పందగ రాములు, బంజర్ సీసీ సుజాత, సంస్థ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణుగూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అని పేర్కొన్నారు. దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్య తరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లొమా విద్య అందకుండా పోతుందని అజిత్ ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకుల భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జి.యువరాజ్, కృష్ణ సాయి, అజయ్, వంశీ, మహేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ రేగా



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పినపాక నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు బత్తుల రామకొండారెడ్డి తండ్రి బత్తుల చిన్నప్పరెడ్డి దశదిన కర్మకు హాజరైన రేగా కాంతారావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే విధంగా ఇటీవల మృతి చెందిన పుట్టి రాంబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండల మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, యువకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# జమేదార్‌బంజర్ నుంచి జ్వలించిన పోరాట జ్యోతి సోయం గంగులు

**- నిజాంపై గర్జించిన ఆదివాసీ బెబ్బులి గంగులు**



దగాపడ్డ నేల విముక్తి కోసం వెట్ట చాకిరీ సంకెళ్లను తెంచేందుకు భూమికోసం భుక్తికోసం ఉవ్వేత్తున ఎగిసిపడిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ విప్లవ చరిత్రలో ఓ అరుదైన ఘట్టం. నిజాం నవాబుల నిరంకుశత్వం, దేశ్‌ముఖ్‌ల అణచివేత రజాకార్ల నెత్తుటి దాహానికి వ్యతిరేకంగా పల్లెపల్లెనా జనం ఆయుధాలు చేతపట్టి గర్జించారు. ప్రముఖుల పోరాటాలే కాక మారుమూల గిరిజనగూడెల నుంచి ప్రాణాలర్పించిన పోరాటయోధుల త్యాగాలు కూడా ఈ గడ్డను పుణీతం చేశాయి. అలాంటి చారిత్రక వీరుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మంపేట మండలం జమేదార్‌బంజర్ గ్రామానికి చెందిన గిరిజన యోధుడు 'ఆదివాసీ బెబ్బులి' అమరుడు సోయం గంగులు ఒకరు. ఒక సాధారణ ఆదివాసీ కుటుంబంలో జన్మించిన గంగులు యవ్వనంలో వేలేరుపాడు మండలం పేరంటాళ్లపల్లి ప్రాంతంలో ఉంటూ ప్రజల సమస్యలపై చైతన్యం తెచ్చారు. గిరినులపై భూ స్వాములు పెత్తందార్లు సాగిస్తున్న వెట్టి ధౌర్జన్యాలను చూసి సహించలేక పోరాటబాట పట్టారు. 1948 మార్చిలో పాల్వంచ ప్రాంత కమ్యూనిస్టు దళంలో చేరిన ఆయన అనతి కాలంలోనే పాల్వంచ అటవీ ప్రాంతాన్ని కమ్యూనిస్టులకు తిరుగులేని విప్లవ స్థావరంగా మార్చడంలో అత్యంత కీలక భూమిక పోషించారు. అటవీ సంపదపై ఆదివాసీల హక్కుల కోసం నడుంకట్టి గెరిల్లా పోరాటానికి బాటలు వేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు దిగ్గజం నల్లమల గిరిప్రసాద్ నాయకత్వంలోని గెరిల్లా దళంలో సోయం గంగులు అత్యంత కీలక బాధ్యతలు నిర్వహించారు. గిరి ప్రసాద్ వ్యూహరచనలకు అనుగుణంగా మన్యం అటవీ మార్గాల్లో గంగులు దళాలను సమర్థవంతంగా నడిపిస్తూ రజాకార్ల దాడులను ఎక్కడికక్కడ తిప్పికొట్టారు. అటవీ ప్రాంత భౌగోళిక పరిస్థితులపై గంగులుకు ఉన్న పట్టు గిరిప్రసాద్ దళానికి కొండంత రక్షణ కవచంలా నిలిచింది. రజాకార్లు నిజాం సైన్యాల కదలికలను ముందే పసిగట్టి గెరిల్లా దాడులతో శత్రువుల గుండెల్లో సింహ స్వప్నమయ్యారు. గిరి ప్రసాద్ నేతృత్వంలో ప్రజలను సమీకరిస్తూ భూ స్వాముల గడీలపై దాడులు నిర్వహించి పేదలకు ధాన్యాన్ని పంచడంలోనూ, పార్టీ క్రమశిక్షణతో కూడిన పోరాటాన్ని నడపడంలోనూ గంగులు ముందు వరుసలతో నిలిచారు. గంగులను మట్టుపెడితేనేతప్ప అటవీ ప్రాంతంలో ఉద్యమాన్ని అణిచివేయలేమని భావించిన భూ స్వాములు పెత్తందార్లు ఆయన సమీప బంధువునే కోవర్టుగా మార్చి కుట్ర పన్నారు. జీలుగుమిల్లి అటవీ ప్రాంతంలో స్పృహ కోల్పోయిన స్థితిలోఉన్న గంగులును శత్రు బలగాలు బంధించి చిత్రహింసలకు గురిచేశాయి. ప్రాణాలు పోతున్న క్షణాల్లోనూ పార్టీ రహస్యాలను నోరువిప్పి చెప్పకుండా నిలిచిన ఆ ధీరుడిని 1951 మే 12న సత్తుపల్లి సమీపంలోని రుద్రాక్షపల్లి గ్రామం వద్ద రావిచెట్టుకు కట్టేసి తుపాకీతో కాల్చి చంపారు. ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి అమరత్వం పొందిన ఆ వీరుడి జ్ఞాపకార్థం జమేదార్ బంజర్‌లో నేటికీ సగర్వంగా నిలిచి ఉన్న స్మారక స్థూపం నాటి పోరాట ధీరత్వాన్ని నిత్యం గుర్తు చేస్తూనే ఉంది. సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవం, సాయుధపోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా మరుగునపడిన ఇలాంటి వీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి చారిత్రక బాధ్యత. సోయం గంగులు అంటే కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదు పీడనపై ఆదివాసీ బిడ్డలు ఎక్కుపెట్టిన విప్లవబాణం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాయుధ పోరాట 'కోయ బెబ్బులి' గా ఆయన చేసిన త్యాగం రాజీలేని పోరాట స్ఫూర్తి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.



ఎస్‌కే సాబీర్ పాషా
సిపిఐ జిల్లా కార్యదర్శి భద్రాద్రి కొత్తగూడెం
9866343978

## కూల్చివేతలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులకు ఆయన మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం కొత్తగా నిర్మించిన ఇండ్ల కంటే వివిధ కారణాలతో కూల్చివేసిన ఇండ్లే ఎక్కువగా ఉన్నాయని పువ్వాడ ఆందోళన వ్యక్తం చేశారు. వికాసం, అభివృద్ధి చేపట్టడం చేతకాని ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతుందని మండిపడ్డారు. పేదల ఇండ్లను కూల్చివేసి వారి జీవనోపాధిపై ప్రభావం చూపడం సరికాదన్నారు. పేదల పొట్ట కొట్టే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇండ్ల కూల్చివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో అనేక మంది పేదలకు ఇండ్ల పట్టాలను అందించడంతో పాటు గృహ వసతి కల్పించేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడం తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమైతే ఇప్పుడు పేదల ఇండ్లను కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్యంగా మారిందని పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు.

## మైనర్ బాలిక ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం:** ఖానాపురం హావేలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉన్న కేసీఆర్ టవర్స్‌లో ఒక మైనర్ బాలిక ఎలకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి ఖానాపురం పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కేసీఆర్ టవర్స్ బ్లాక్ బిలో ఉంటున్న మైనర్ బాలికను అదే ప్రాంతానికి చెందిప యువకుడు వారం రోజుల క్రితం అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఎలకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు తొలుత ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషయంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సదరు బాలిక బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. బాలిక మరణానికి యువకుడే కారణమంటూ బాలిక తల్లిదండ్రులు ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ భానుప్రకాశ్ తెలపగా ఆఘయిత్యానికి పాల్పడ్డ యువకుడిని శిక్షించాలని భాదితుల తరుపున బంధువులు, మహిళాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పూర్తి స్థాయి విచారణ చేపట్టి అసలు విషయం తెలియజేస్తామని సిఐ తెలిపారు.

## మెడికల్ సీటు సాధించిన విద్యార్థికి అభినందనలు



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డుకు చెందిన బక్కా రాములు, సావిత్రి దంపతుల కుమారుడు బక్కా సందీప్ నీట్‌లో ర్యాం కు సాధించి హైదరాబాద్‌లోని నోవా మెడికల్ కాలేజీలో మెడికల్ సీటు సం పాదించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందిం చారు. రాంపూడి రోశయ్య నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో బక్కా సందీప్‌ను ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాంపూడి రోశయ్య, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, 16వ వార్డు కౌన్సిలర్ రాచమంటి బలరామయ్య, 17వ వార్డు కౌన్సిలర్ బత్తుల సుమతి, రాంపూడి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫామ్స్‌ను కౌన్సిలర్ వెంపటి ఉమావెంకటేశ్వర్లు బుధవారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమఫలాలను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని ప్రసాద్, వెంపటి రవి, నల్లబోలు అనితరెడ్డి, వడ్లకొండ భుజంగరావు, బొడ్డు హర్షవర్ధన్, ఏపూరి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ నగర్‌లో టిసిసి నాయకుల సమావేశం




**ప్రజాపక్షం/ తల్లాడ :** మండలంలోని ఎన్‌టిఆర్ నగర్‌లో తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టిసిసి) జిల్లా ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు కెవి ఇజ్రాయిల్ అధ్యక్షతన జిల్లా అధ్యక్షుడు గుంటి బాబురావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టిసిసి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ మానుకొండ సుదర్శనం మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమం కోసం క్రైస్తవులకు మూడు ఎకరాల (స్మశానవాటిక) కేటాయించాలని, క్రైస్తవ భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు దాటిన క్రైస్తవులకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరీక్షణరావు, రాష్ట్ర సెక్రటరీ ఏసుదాస్, జిల్లా కార్యదర్శి రాజరత్నం, నూతన అధ్యక్షులు ప్రకాష్‌రావు, సెక్రటరీ కృష్ణ, మహిళా సోదరీమణులు , టిసిసి సభ్యులు పాల్గొన్నారు.

## లక్ష్మీగణపతి స్వామికి వెండి మకర తోరణం సమర్పణ

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట పట్టణంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మి గణపతి స్వామి వారికి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, విజయ సాయిసెల్ వరల్డ్ అధినేత సీమకుర్తి జితేంద్ర, అమృత దంపతులు రూ.11లక్షలు విలువ గల వెండి మకర తోరణాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జితేంద్ర, అమృత దంపతులను చిరు సన్మానం చేసి వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. స్వామి వారి కృపతోనే తాము ఈ సేవ చేసుకునే భాగ్యం కలిగిందని, స్వామి వారికి మకర తోరణం సమర్పించడం ఎంతో సంతోషంగా, అదృష్టంగా భావిస్తున్నామని ఈ సందర్భంగా జితేంద్ర దంపతులు తెలిపారు.

## ఖచ్చితమైన భూ రికార్డులు రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయి భూమే ప్రామాణికం**

**-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని, భూ రీసర్వేలో క్షేత్రస్థాయిలో ఉన్న భూమినే ప్రామాణికంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలం పల్లెగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, భూ యజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించి, ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భూమి ఉండి పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు. పాస్‌బుక్ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి విస్తీర్ణం రికార్డులతో సరిపోని వారు. రికార్డుల్లో భూమి వివరాలు నమోదు కాని సందర్భాలను రీసర్వే ద్వారా గుర్తించి నిబంధనల ప్రకారం పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. పట్టాదారు పాస్‌బుక్‌లోని విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణం మధ్య తేడాలను చుట్టు పక్కల రైతుల సమక్షంలో కొలతలు నిర్వహించి నిర్ధారించాలని సూచించారు. భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నెంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రీసర్వేలో తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రీసర్వే సమయంలో రైతులు త మ భూముల వద్ద అందుబాటులో ఉండి సంబంధిత పత్రాలను అధికారులకు అందజేస్తూ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమం లో తహశీల్దార్ వినయేందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చుండూరు సృజన, సంబంధిత అధికారులు, రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.

## బాల భారతిలో ఉపాధ్యాయులకు శిక్షణ




**ప్రజాపక్షం/ తల్లాడ :** కెఎస్‌ఎం విద్యా సంస్థల వ్యవస్థాపకులు కోటగిరి రంగారావు 15వ వర్థంతి సందర్భంగా ఉపాధ్యాయుల అభివృద్ధి, ఆధునిక విద్యా విధానాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో బాలభారతి విద్యాలయంలో కోటగిరి రంగారావు మెమోరియల్ టీచర్స్ డెవలప్‌మెంట్ సమ్మిట్ 2026 కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో బాలభారతి ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలను జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రమశిక్షణ, ఐక్యత, క్రీడాస్ఫూర్తి, పట్టుదల వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. బోధన నుంచి పరిశోధన వైపు 2030 నాటికి బాలల కోసం ఉపాధ్యాయులను సిద్ధం చేయడం అనే ప్రధాన అంశంతో నిర్వహించిన ఈ సదస్సులో ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేయడం, ఆధునిక విద్యా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లాడ మండల విద్యాధికారి దామోదర వరప్రసాద్, విద్యా సంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ కోటగిరి శ్రావణి, ప్రిన్సిపాల్ రామారావు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పుష్పగుచ్చం అందించి శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త దారా విష్ణు మోహన్‌రావు, సీనియర్ జర్నలిస్టు దుగ్గిదేవర అజయ్‌కుమార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.